క్లుప్తంగా

వైభవంగా మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



వాల్మీకి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పూజ చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సేవ సంఘం నాయకులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం



భోగేశ్వరాలయంలో వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో గతేడాది కంటే ఆదాయం పెరిగినట్లు ఈఓ రామానుజన్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో టీ, మిఠాయి, టెంకాల విక్రయం చేసుకునేందుకు వేలంపాటలు నిర్వహించగా రూ.2,15,000 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ.32 వేలు ఆదాయం పెరిగిందని చెప్పారు. పర్యవేక్షణ అధికారి హరిచంద్రారెడ్డి, చైర్మన్ కంది శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ, ఆలయ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో జడ్జి పూజలు



జడ్జి దంపతులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి సోమవారం పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్జి దంపతులకు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సురేష్‌స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4లక్షల విలువైన బాణసంచా సీజ్



సీజ్ చేసిన బాణసంచాతో ఎస్‌ఐ ఎర్రిస్వామి

కోడుమూరు రూరల్: కోడుమూరు పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నివాస గృహాల మధ్య ఓ గోదాములో అక్రమంగా నిల్వవుంచిన రూ.4లక్షలకు పైగా విలువ చేసే బాణసంచాను ఎస్‌ఐ ఎర్రిస్వామి సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎవరూ బాణాసంచా నిల్వ ఉంచుకోరాదని, బాణా సంచా అమ్మాలంటే లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

సెల్ టవర్ ఎక్కిన యువకుడు



టవర్ ఎక్కిన వడ్డె రామాంజినేయులు

పాణ్యం: మద్దూరు గ్రామానికి చెందిన వడ్డె రామాంజినేయులు అనే యువకుడు సెల్‌టవర్ ఎక్కి సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వడ్డె రామాంజినేయులతో మాట్లాడారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. వడ్డె రామాంజినేయులుకు భార్య ఉంది.. అయితే మరో మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తడంతో మహిళను కొట్టగా ఆమె పోలీసులను ఆశ్రయించి అతనిపై కేసు నమోదు చేయించింది. కాగా, తనకు ఆ మహిళ కావాలంటూ సోమవారం సెల్‌టవర్ ఎక్కి బెదిరింపులకు దిగాడు. ఫోన్‌లో వడ్డె రామాంజినేయులతో మాట్లాడి సర్దిచెప్పి సెల్‌టవర్ దింపినట్లు పోలీసులు చెప్పారు. తర్వాత సీఐ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిలా ఉండగా వడ్డె రామాంజినేయులపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నట్లు వెల్లడించారు.



గుంతలమయంగా నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని నందికొట్కూరు రోడ్డు



బిర్లాగేట్ సర్కిల్ వద్ద పైపై మరమ్మతులు చేయడంతో మళ్లీ యథాస్థితికి చేరిన రోడ్డు



వాల్‌మార్టు సమీపంలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

గుంతలు వెక్కిరిస్తున్నాయి!

అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా మారుస్తాం. ఎక్కడా ఓ చిన్న గుంత కూడా కనిపించదు. ఇలా ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు ప్రగల్భాలు పలికారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతుంది రోడ్ల అభివృద్ధి దేవుడెరుగు ఉన్న రోడ్లకు కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. ఎక్కడైనా చేసినా కాసులకు కక్కుర్తి పడి నాణ్యతకు తిలోదకాలు ఇస్తుండటంతో పది రోజుల్లో మళ్లీ యథాస్థితికి చేరుకుంటున్నాయి. ఇక్కడ చిత్రాల్లో గుంతలు పడి, కంకరతేలి ప్రమాదకరంగా కనిపిస్తున్న ఈ రోడ్లు ఎక్కడివో కాదు జిల్లా కేంద్రం కర్నూలు నగరంలోనివే. పైపైన మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతో గుంతలు తేలి అధికారులను వెక్కిరిస్తున్నాయి. ఈ దారుల్లో ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ఏ మాత్రం అదమరిచినా ప్రమాదం బారిన పడాల్సిందే.

– కల్లూరు

చల్లంగ చూడమ్మా.. చౌడేశ్వరీ మాత!



భారీ ఊరేగింపు మధ్య అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న కాటసాని దంపతులు



అమ్మవారికి పూజలు చేస్తున్న కాటసాని

ఓర్వకల్లు : ప్రజలను ఆయురారోగ్యాలతో చల్లంగా దీవించమ్మా!.. అని కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ చౌడేశ్వరీమాతను వేడుకున్నారు. సోమవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో జరుగుతున్న చౌడేశ్వరీదేవి ఉత్సవాల సందర్భంగా స్థానిక నాయకుడు కాశిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆహ్వానం మేరకు కాటసాని దంపతులతో పాటు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, పెద్దపాడు శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా విష్ణువర్ధన్‌రెడ్డి స్వగృహంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమై, వారి బాగోగులను తెలుసుకున్నారు. అనంతరం కాటసాని దంపతులు నూతన పట్టు వస్త్రాలను తలపై పెట్టుకొని భారీ ఊరేగింపుతో దేవస్థానం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని, పట్టు వస్త్రాలను సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారి రామకృష్ణ కాటసాని దంపతులకు అర్చనలు నిర్వహించి, ఎల్లప్పుడు అమ్మవారి ఆశిస్సులు ఉండాలని దీవించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జీకే వెంగన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగ తిరుపాలు, నాయకులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, క్రిష్ణఫార్, జెల్లి క్రిష్ణ, అబ్రహాం, కృపయ్య, అనిల్, ప్రభు, గుట్టపాడు రామకృష్ణారెడ్డి, పాల మధుమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచు చిన్న అయ్యన్న, రంగడు, కొమ్ము లక్ష్మన్న, యువరాజు, కన్నమడకల సర్పంచు తిక్కలి కాశీం, మార్కాపురి శ్రీనివాసులు, బ్రాహ్మణపల్లె కె.రవికుమార్, గుడుంబాయి తండా శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై నిగ్గు తేల్చాలి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసరెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని.. విచారించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ రాముడుకు ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయని, పనులు నిర్వహించకుండానే చేసినట్లుగా ఉపాధి సిబ్బంది దొంగ మస్టర్లు సృష్టించి డబ్బులను కాజేశారని ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు పనుల్లోకి రానప్పటికీ పనుల్లోకి వచ్చినట్లుగా చూపుతున్నారని, విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే వారి పేర్ల మీద మస్టర్లు వేసుకుని భారీగా ఉపాధి నిధులను పక్కదారి పట్టించారని విన్నవించారు. స్పందించిన ఎంపీడీఓ రాముడు ఉపాధి పనులపై విచారణ చేయించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్తులు సురేంద్రరెడ్డి, బోయ శివ, మద్దిలేటి, అయ్యస్వాములు, కురువ లక్ష్మన్న, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభకు స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

ఓర్వకల్లు : ఈ నెల 16వ తేదీన భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జిల్లా పర్యటనను పురస్కరించుకొని బహిరంగ సభ నిర్వహణ నిమిత్తం మండలంలోని వేర్వేరు ప్రాంతాలలో పలువురు మంత్రులు స్థలాలను పరిశీలించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సిరి ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర పరిశ్రమలు, వాణి జ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర రోడ్లు భవణాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రెండు చోట్ల పరిశీలించారు. ముందుగా నన్నూరు టోల్‌గేట్ వద్ద ఉన్న రాగమయూరిలోని నారాయణ కళాశాల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి గుట్టపాడు స్టీల్ ప్లాంట్ ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు.

ప్రజలపై భారం తగ్గించడానికే జీఎస్టీ సంస్కరణలు



సోమయాజులపల్లెలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న సీఈఓ వేణుగోపాల్

ఓర్వకల్లు : సామాన్య ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చారని సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో జీఎస్టీ తగ్గుదలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కొత్త సంస్కరణలు తీసుకొచ్చి పేద, మధ్య తరగతి కుటుంబాలకు దాదాపు రూ.2 లక్షల కోట్ల ఆర్థిక భారాన్ని తగ్గించారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలన్నీ తగ్గాయన్నారు. కార్యక్రమంలో ఏఓ మధుమతి, గ్రామ సర్పంచు జయమ్మ, బ్రహ్మకుమారులు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పాణ్యం: జీఎస్టీపై అన్ని పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం 3–5గంటల మధ్య సమయంలో 6–10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కావున అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు విజయవంతంగా నిర్వహించాలన్నారు.

మందక్రిష్ణ పర్యటనను జయప్రదం చేయాలి

పాణ్యం : ఈనెల 12వ తేదీన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద క్రిష్ణ మాదిగ నంద్యాలకు వస్తున్నారని, అందరం కలిసి ఆయన పర్యటనను జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ జరిగిన తర్వాత మొదటిసారిగా ఆయన జిల్లాకు వస్తున్నారని, కావున ప్రతి గ్రామం నుంచి మాదిగ సోదరులు భారీగా తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాబు, వెంకటాద్రి, లక్ష్మయ్య, రాజా, జాషువా, తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు

కోడుమూరు రూరల్: అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి లెనిన్‌బాబు విమర్శించారు. ఎకరాకు రూ.50వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ కింద రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి, కూరగాయల పంటలు భారీగా దెబ్బతిన్నాయన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని, కనీసం దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు కూడా మంత్రులు, ఎమ్మెల్యేలకు తీరిక లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాముడులకు అందజేశారు. సీపీఐ నియోజకవర్గ, పట్టణ కార్యదర్శులు రాజు, శేషుకుమార్, హమాలీ, రైతు సంఘం నాయకులు బజారి, రాజు, రాముడు, బాబు, మద్దిలేటి, శివుడు, శంకర్ పాల్గొన్నారు.

అతివృష్టి మండలాలుగా గుర్తించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు : అధిక వర్షాల వల్ల నష్టపోయిన కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను అతివృష్టి మండలాలుగా గుర్తించాలని (సీపీఐ) ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ విష్ణుప్రసాద్‌కు వినతి పత్రమిచ్చారు. జగన్నాథం మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే వర్షాలు రావడంతో రైతులు ఉల్లి, టమాట, పత్తి, మిరప, మొక్కజొన్న, కంది, తదితర పంటలు విస్తారంగా సాగు చేశారు. పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందని రైతులు ఆనంద పడగా.. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో భారీ వర్షాలు కురవడంతో ఉల్లి, టమాట, పత్తి, మిరప, కంది తదితర పంటలు పొలంలోనే కుళ్లిపోయాయన్నారు. అంతేకాకుండా ఉల్లి, టమాట పంటలకు సరైన గిట్టుబాటు ధరలేక రైతులు తమ పంటల దిగుబడులను పొలాల్లోనే వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పంటలను పరిశీలించి ఎకరాకు రూ. 50వేలు నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అన్వర్ బాషా, రామాంజనేయులు, నూర్జహాన్, రబీయా, పుల్లన్న, బాషా, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కల్లూరు : రబీ సీజన్‌లో పప్పు శనగ, వేరుశనగ పంటలు సాగు చేయాలనుకున్న రైతులు విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలానికి 1,430 క్వింటాళ్ల పప్పు శనగ, 150 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించినట్లు పేర్కొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

పాణ్యం : మండల కేంద్రంలోని సర్వే నంబర్ 1200 రస్తా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, అధికారులు చర్యలు తీసుకొని తొలగించాలని ప్రజా సంఘాల నాయకులు దత్తు, వెంకటాద్రి కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో డీటీ శివశంకర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ పాణ్యంలోని విజయానికేతన్ పాఠశాల యాజమాన్యం స్థలాన్ని ఆక్రమించి రేకులషెడ్డు నిర్మాణాలు చేపట్టారన్నారు. అధికారులు చర్యలు తీసుకొని నిర్మాణాలను తొలగించి ప్రజా శ్రేయస్సుకు వినియోగించాలని కోరారు. దాదాపుగా 60సెంట్ల వరకు ఆక్రమించారన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, రైతులు

సి.బెళగల్: అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు, రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. రాజు మాట్లాడుతూ.. ఉల్లి, పత్తి, మిరప, కంది, సజ్జ, వేరుశనగ పంటలు భారీ వర్షాల వల్ల దెబ్బతిన్నాయని, రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని అన్నారు. రైతులకు ప్రతి ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని, ఉల్లికి మద్దతు ధరగా రూ.3 వేల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. మద్దిలేటి, శేషు, గిడ్డయ్య, రంగన్న, శ్రీనివాసులు, నడిపి నాగన్న, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు : అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయకులు సుధాకర్, ఆర్‌వీఎఫ్ నాయకులు రవీంద్ర డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారిణి మధుమతికి వినతి పత్రం సమర్పించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం



కోట్ల హర్షను సత్కరిస్తున్న సతీష్, ప్యాలకుర్తి గ్రామ నాయకులు

కోడుమూరు రూరల్: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. సోమవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్‌తో కలిసి వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికైన సందర్భంగా కోట్ల హర్షను పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కోట్ల హర్ష మాట్లాడుతూ.. కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిచి పార్టీ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బందెనవాజ్, నాయకులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కొత్తూరు రవికుమార్, శ్రీను, మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కర్నూలు: నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న చాకలి లింగన్న (40) అదృశ్యమయ్యాడు. కోడుమూరు పట్టణానికి చెందిన ఈయన కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కర్నూలుకు వచ్చారు. లింగన్న ఆర్‌టీఏ ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత నెల 25వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభించలేదు. కుమారుడు శివకుమార్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 94418 92833 నంబర్‌కు సమాచారం తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

అర్జీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో రైతుల భూసంబంధిత అర్జీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం తన కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. రైతుల అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. ముఖ్యంగా జాయింట్ ఎల్‌పీఎంలు, భూ కొలతల సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, వీఆర్వోలు, సర్వే సహాయకులు సబ్‌డివిజన్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేలా సహాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ తరుణ్, వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ కూడా మండల అధికారులతో కలిసి పీజీఆర్‌ఎస్‌ను నిర్వహించారు.

ఆటోమాబు సేవలు మరువలేనివి



ఆటోమాబుకు నివాళులర్పిస్తున్న కాటసాని

పాణ్యం : పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ షేక్ మహబూబ్‌బాషా (ఆటో మాబు) సేవలు మరువలేనివని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆటో మాబు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాణ్యం ఉప సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు తనవంతుగా సేవలు అందించారన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజలకు, అధికారులతో ఎంతో స్నేహపూర్వకంగా మెలిగి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. మంచి నాయకుడిని కోల్పోయామన్నారు. ఆటోమాబు కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, కో–ఆప్షన్ సభ్యులు, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చాంద్‌బాషా, జాకీర్‌ఉసేన్‌, సత్యాలు, మాసుం, బాబు, సుబ్రహ్మణ్యం, మహేష్, బాబి, చాంద్‌బాషా, టైలర్‌బాష తదితరులు ఉన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



సి.బెళగల్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



బస్సు కోసం ఎదురుచూపు

అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులు లేక మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సోమవారం ఉదయం ప్రయాణికులు మండల కేంద్రం సి.బెళగల్ నుంచి కర్నూలుకు వెళ్లేందుకు బస్సు కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు అరకొరగా రెండు, మూడు బస్సులు మాత్రమే ఉండడంతో సి.బెళగల్ బస్టాండ్‌లో భారీగా వేచి ఉన్న ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. రెండు గంటలకు ఒక్కసారి వచ్చే ఆర్టీసీ బస్సును ఎక్కేందుకు పోటీపడ్డారు. తోటి ప్రయాణికులతో చిన్నపాటి యుద్ధం చేయాల్సి వచ్చింది. సమస్యను పలుమార్లు అధికారులు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు స్పందించి మండలానికి అసరమైన బస్సులను నడపాలని కోరుతున్నారు.

– సి.బెళగల్